## అనర్హులకు ఇండ్ల కేటాయింపుపై ఫిర్యాదు

ములుగు, జూన్16(నమస్తేతెలంగాణ) : వెంకటాపూర్ మండలం నర్సాపూర్‌లో 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, భూమి లేని నిరుపేదలకు ఇవ్వలేదని గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు కత్తుల రమేశ్ సోమవారం కలెక్టర్ టీఎస్ దివాకరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ గ్రామంలో సొంతంగా పునాది తీసి పిల్లర్స్ వేసిన ఇండ్లను ఇందిరమ్మ ఇల్లు పథకంలోకి మార్చి బిల్లులు తీసుకునే ప్రయత్నం జరుగుతున్నదన్నారు. ఇండ్లు ఉన్న వారికే తిరిగి ఇల్లు మంజూరు చేశారని ఆరోపించారు. కాగా, కలెక్టర్ స్పందించి పూర్తి విచారణ చేయాలని వెంకటాపూర్ ఎంపీడీవోను ఆదేశించినట్లు రమేశ్ పేర్కొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగం ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శాలిని

ములుగురూరల్, జూన్ 16 : కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం పరిధి కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వర్‌రావు జనవరి 23న ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రాలేదని గ్రామ సభలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ నాగేశ్వర్‌రావు కుమార్తె కుమ్మరి శాలిని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తండ్రి మృతితో కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉందని, డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం ఇప్పించాలని ఆమె కోరారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల బిల్లులు చెల్లించాలి**

ములుగు మండలంలోని ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేసిన తమకు బిల్లులను వెంటనే చెల్లించాలని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సంఘాల మహిళలు సోమవారం అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు చేరుకొని వినతి పత్రం అందజేశారు. రజిత, గీత, రుద్రమదేవి, లక్ష్మి, అఫిజా, ఇందిర, సుమలత, నాగజ్యోతి, శ్రీలత, లావణ్య, అమినాసుల్తానా, వీరమ్మ, సుజాత, స్వర్ణలత పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, జూన్ 16 : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రా గిరిజనుల వినతులు అందుకున్నారు. తాడ్వాయి మండలం కొత్తపల్లివాయిలో పోడు భూమి సాగు చేస్తుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని స్థానిక గిరిజనులు ఫిర్యాదు చేశారు. అలాగే, పలు సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తం 25 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఏపీవో వసంతరావు, ఏవో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, డీడీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, డీటీ అనిల్, జీసీసీ డీఎం వాణి, ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సొసైటీలతో ఇసుక క్వారీల నిర్వహణ

ఏటూరునాగారం, జూన్ 16 : ఇసుక రీచ్‌లను సొంతంగా నిర్వహించుకుని సొసైటీలు లాభం పొందాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సూచించారు. ఐటీడీఏ పరిధిలోని ఎంపిక చేసిన ఇసుక సొసైటీలకు సంబంధించిన 30 మంది సభ్యులతో సోమవారం సాయంత్రం గిరిజన సంఘాల స్వీయ నిర్వహణ ఇసుక కార్యకలాపాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం చేపట్టారు. సొసైటీ సొంతంగా ఇసుక క్వారీలు నిర్వహించుకునే అంశంపై చర్చించారు. దీనికి సభ్యులు కూడా సమ్మతించారు. ఏపీవో వసంతరావు, డీటీలు అనిల్, కిశోర్‌కుమార్, టీజీఎండీసీ సిబ్బంది, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

WANTED CHEMISTRY FACULTY
A reputed English Medium High School in HANUMAKONDA requires CHEMISTRY FACULTY to deal IIT Foundation from 6th to 10th Classes.
Interested and Experienced Candidates may Contact Immediately. ★ Attractive Salary
Cell: 9989734513

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
jobs Apply Now!
★PHARMACY BOYS (Experienced)
★LAB TECHNICIANS (Experienced)
★COMPUTER OPERATORS & SUPERVISORS
Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2 PM.
NTW-522

WANTED
★ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10th, ఇంటర్, డిగ్రీ పాసైనవారు అర్హులు. ఆకర్షణీయమైన జీతం రూం+భోజనం ఫ్రీ, ఇన్సెంటివ్స్ కలవు. సెల్: 7337378927, 7842425065.
NTW-337101

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

BUSINESS OFFER
★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

CHANGE OF NAME
I, KANDIKONDA TEJASRI D/o KANDIKONDA POSHALU R/o. 27-8-7, Shanthi Nagar, Hasanparthy, Hanumakonda, Warangal, TG, 506371. Change My Name As NEDUNURI TEJASRI W/o NEDUNURI KOTESHWAR RAO For All Puposes.

CHANGE OF NAME
I, BHUKYA SOMLA NAIK R/o H.No. 31-3-2021, Road No.3, Venkateswara Colony, TNGOS Phase-2, 100 Feet Road, Waddepally, Hanamkonda Mandal, Hanumakonda District-506 370. T.G. Have Changed My Name From BHUKYA SOMLA to BHUKYA SOMLA NAIK For All Puposes.

CHANGE OF NAME
I, NELLI SHIRISHA D/o NELLI SATHISH, R/o H.No. 1-3/A, Karepalli Village, Singareni Mandal, Khammam District-507122. T.G. Have Changed My Name From NILLI SANGEETHA to NELLI SHIRISHA For All Puposes.

CHANGE OF NAME
★I, SHAIK MUSTAFA HYDER ZIYAD (Old Name) H.NO.3-16-189/15/A/1, Dreamland Colony, Near Pothana College, KU Road, Hanumakonda City & Dist-506011. T.G. Have Changed my Name from SHAIK MUSTAFA HYDER ZIYAD TO SHAIKH MUSTAFA HYDER ZIYAD (New Name) S/o SHAIK MUJAB HYDER THARIQ for all purposes.
NTW-6707

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**


ప్రజావాణిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి రూరల్, జూన్ 16 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదటి లిస్టులో ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు అధికారులు చెప్పారని, కానీ, తర్వాత కొందరు తన పేరును లిస్టులో లేకుండా చేశారని చిట్యాల మండలం కైలాపూర్ గ్రామానికి చెందిన తాత భాగ్యలక్ష్మి విన్నవించారు. ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు వాహన సౌకర్యాలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ కోరారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రజాభవన్ నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మూడు రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 53 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

## ములుగులో ప్రజావాణికి ఆలస్యంగా అధికారులు


కలెక్టరేట్ వద్ద ఎదురు చూస్తున్న ఫిర్యాదుదారులు

ములుగురూరల్, జూన్ 16 : ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం అధికారులు ఆలస్యంగా రావడంతో ప్రజలు పడిగాపులు కాశారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కూర్చునేందుకు కుర్చీలు లేక, తాగేందుకు నీరు లేక చెట్ల కింద, బాల్కనీల కింద వేచి ఉన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభించాల్సి ఉండగా అదనపు కలెక్టర్లు 11 గంటలకు చేరుకొని దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ మంత్రి పర్యటనలో ఉండగా ఆయనను కలిసేందుకు వచ్చిన ప్రజలు మధ్యాహ్నం వరకు గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇతర శాఖల అధికారులు సైతం ప్రజావాణికి టైమ్‌కు రాలేదు. కాగా, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా జిల్లా నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం సమావేశ మందిరం వద్ద కుర్చీలు, తాగునీటి వసతిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**63 దరఖాస్తుల స్వీకరణ**

కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో 63 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. గృహ నిర్మాణ శాఖకు 30, భూ సమస్యలు 17, ఉపాధి కల్పనకు 6, పింఛన్ కోసం ఒకటి, ఇతర శాఖలకు సంబంధించిన 9 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి అనంతరం వైద్య సిబ్బంది, వైద్యులతో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు సమీక్ష నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు రాకుండా తీసుకునే ముందస్తు చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్, డెమో సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పులు తీర్చలేక చిరు వ్యాపారి ఆత్మహత్య

తాడ్వాయి, జూన్ 16 : వ్యాపారం చేసేందుకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో చిరు వ్యాపారి పిల్లి సత్యం(50) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. సత్యం కొనేళ్లుగా మేడారంలో గాజుల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వ్యాపార అభివృద్ధికి సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. వ్యాపారం సరిగా సాగకపోవడంతో మనస్తాపం చెంది, సోమవారం ఉదయం షాపు వెనక ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పురుగు మందు తాగి వృద్ధురాలు..


మధునమ్మ(ఫైల్)

చిట్యాల, జూన్ 16 : పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలోని రాంనగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కట్కూరి మధునమ్మ (65)కు కొంతకాలంగా రెండు గుంటల భూమి విషయంలో కుటుంబ సభ్యులతో గొడవలు అవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు స్థానిక సివిల్ దవాఖానకు, మెరుగైన వైద్య నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకులు కట్కూరి రమేశ్, కట్కూరి శ్రీను కారణమని వృద్ధురాలి కుమార్తె ముత్యాల రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరించారు.

## గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

మహదేవపూర్, జూన్ 16 : మండలకేంద్రంలో ఒకరు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాజుల రాజు(25) దుబ్బగూడెంలో కొంతకాలంగా కిరాణా షాపు నడిపిస్తున్నాడు. సోమవారం ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం భూపాలపల్లి 100 పడకల దవాఖానకు తీసుకెళ్లారు. ఘటనకు గల కారణాలు తెలియరాలేదు.

## ఇసుక లారీ డ్రైవర్లపై కేసు నమోదు

మహదేవపూర్, జూన్ 16 : అతివేగంగా వెళ్తున్న నాలుగు ఇసుక లారీల డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం బొమ్మాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో నాలుగు ఇసుక లారీలు లోడింగ్ కోసం మహదేవపూర్ వైపు అతివేగంగా వెళ్తుండగా గుర్తించి లారీ డ్రైవర్లు దిలీప్ కుమార్, అమిత్ కుమార్, జన్డియల్, సునీల్‌పై రాష్ డ్రైవింగ్ కేసు నమోదు చేశారు. వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## దాడి చేసిన నిందితులపై ..

మొగుళ్లపల్లి, జూన్ 16 : పొలంలోని జీలుగను ధ్వంసం చేసి, ఒకరిని గాయపర్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని ఎలారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొర్రి కుమారస్వామి తన భూమిలో జీలుగ విత్తనాలు విత్తగా ఇదే గ్రామానికి చెందిన మొర్రి ఐలయ్య, మొర్రి మౌనిక ఎడ్లతో గుంటుక తోలి జీలుగా మొక్కలను ధ్వసం చేస్తున్నారు. ఈక్రమంలో అడ్డు పడిన తనపై నిందితులు కర్రతో దాడి చేయగా బలమైన గాయమైందని కుమారస్వామి ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

## పేలుడు పదార్థాలతో జాగ్రత్త

మల్లంపల్లి, జూన్ 16 : స్టోన్ క్రషర్ల నిర్వాహకులు పేలుడు పదార్థాలు, మందు గుండు సామగ్రిని జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలోని సహ్యాద్రి, వాసుదేవ స్టోన్ క్రషర్లను సందర్శించి పేలుడు పదార్థాల స్టాక్‌ను పరిశీలించి తనిఖీ చేశారు. అనంతరం క్రషర్లకు సంబంధించిన అనుమతి పత్రాలతో పాటు పేలుడు పదార్థాల అనుమతి పత్రాలను పరిశీలించి నిర్వాహకులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సీఐ సురేశ్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు ఉన్నారు.

# నోటీసుల పేరుతో వేధింపులు


మాట్లాడుతున్న నాగజ్యోతి, లక్ష్మణ్‌రావు

ములుగు, జూన్16 (నమస్తే తెలంగాణ) : హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నోటీసుల పేర్లతో బీఆర్‌ఎస్ నాయకులను వేధింపులకు గురి చేస్తున్నారని పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌రావు అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ కోర్టులో హాజరైన సందర్భంగా సోమవారం జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో వారు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేసినా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. కమిషన్ల ముందు కేసీఆర్, హరీశ్‌రావును హాజరుపర్చి కాంగ్రెస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఫార్ములా ఈ రేస్‌లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలిపిన కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు పిలవడం కాంగ్రెస్ నాయకుల మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, ఎట్టి జగదీశ్, తుమ్మ మల్లారెడ్డి, అంకూస్, గడదాసు సునీల్‌కుమార్, దుర్గం రమణయ్య ఉన్నారు.

## ఐటీఐలో కొత్త కోర్సులు ప్రారంభం

భూపాలపల్లి రూరల్, జూన్ 16 :భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఆధ్వర్యంలో 2025-26/27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ నూతన కోర్సులను ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీఐలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జూన్ 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8985100563 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఐటీఐ ప్రిన్సిపాల్ జమ్లనాయక్, ఆర్డీవో రవి పాల్గొన్నారు.

## రేపు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ పరీక్ష

గణపురం/ చిటాల/ కాటారం/ భూపాలపల్లి రూరల్, జూన్ 16 : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు మండల స్థాయి ప్రవేశ పరీక్షనుగణపురం, చిట్యాల, కాటారం ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు ఊరుగొండ ఉప్పలయ్య, కోడపాక తిరుపతి, శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు కొసరి సరిత సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 1 సెప్టెంబర్ 2016 నుంచి 31 సెప్టెంబర్ 2017 మధ్య జన్మించిన వారు అర్హులని, tgss.telangana. gov.inలో వివరాలు నమోదు చేసుకొని ప్రింట్ కాపీతో రావాలని సూచించారు. వివరాలకు 9989545288, 9966992295 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే ఐడీవోసీ కార్యాలయంలో స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, ఎల్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీవైఎస్‌వో సీహెచ్ రఘు, ఆర్డీవో రవి, ఏఎంవో కే లక్ష్మణ్ ఆవిష్కరించారు.

## హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు


భూపాలపల్లి రూరల్, జూన్ 16: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రీ మెట్రిక్ బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో ఉచిత వసతి కోసం జూన్ 30లోగా www.bchostels.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి డీ క్రాంతి కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపురం బాలికల వసతి గృహంలో 81, చిట్యాల బీసీ బాలుర వసతి గృహంలో 64, మొగుళ్లపల్లి బీసీ బాలుర వసతిగృహంలో 27, మహదేవ్‌పూర్ బాలుర వసతి గృహంలో 72, మహాముత్తారం బాలుర వసతి గృహంలో 69 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం మహిళ కంట తడి


కంటతడి పెడుతున్న రాజమణి

ములుగురూరల్, జూన్ 16 : ఎస్టీ నాయకపోడ్ సామాజిక వర్గానికి చెందిన తనకు ఇందిరమ్మ ఇల్లు రాగా కొందరు గ్రామస్తులు ఉద్యోగం ఉందని, ఎలా ఇల్లు ఇస్తారని జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారని, తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన గండెపల్లి రాజమణి కంట తడి పెట్టింది. కలెక్టర్‌కు తన గోడును విన్నవించుకునేందుకు వేచి ఉన్న రాజమణిని 'నమస్తే తెలంగాణ' పలకరించగా తాను చల్వాయి బాయ్స్ హాస్టల్‌లో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంగా పనిచేస్తున్నానని, చాలీ చాలని జీతంతో కుటుంబాన్ని వెల్లదీస్తున్నానని, భర్త కూలీ పనులకు వెళ్తాడని చెప్పింది. ఇద్దరు కుమార్తెలు కాగా, ప్రస్తుతం తన ఇల్లు దీన స్థితిలో ఉందని, పరదాలు కట్టుకొని ఉంటున్నామని కంట తడిపెట్టింది. ఇందిరమ్మ ఇంటి పట్టాను సైతం అధికారులు అందించారని, కొందరు కావాలనే ఫిర్యాదు చేశారని, ఈ విషయాన్ని సదరు కార్యదర్శి చెప్పినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి తనకు ఇల్లును మంజూరు చేయాలని కోరారు.

## బిడ్డ కొడుకని చేరదీస్తే ఆస్తిని కాజేసి, ఆగం జేసిండు


బాధితుడు గంట అంకయ్య

భూపాలపల్లి రూరల్, జూన్ 16 : బిడ్డ కొడుకని చేరదీస్తే తన ఆస్తిని కాజేసి ఆగం చేశాడని కాటారం మండలకేంద్రానికి చెందిన గంట అంకయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం కలెక్టర్ వద్ద ఆయన మాట్లాడుతూ మహాముత్తారం మండలం మైబూప్‌పల్లి గ్రామానికి చెందిన తన బిడ్డ కొడుకు బౌతు దేవేందర్‌ను చేరదీస్తే తనను నమ్మించి భూమిని తన పేరుపై పట్టా చేయించుకున్నాడని తెలిపాడు. అంతేకాకుండా తన రూ.10 లక్షలు తీసుకొని ఇవ్వకుడా ఇంటి నుంచి వెళ్లగొట్టాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏప్రిల్ 4 నుంచి మద్దులపల్లిలో ఉంటూ భిక్షాటన చేస్తున్నానని, ఇంత వరకు దేవేందర్ తన జాడకు రాలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. తన ఇంట్లోనే ఉంటూ భూమి, డబ్బులను కాజేసి ఇబ్బందులు పెడుతున్న అతడిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

# ట్రీట్‌మెంట్‌కు అంబులెన్స్ డ్రైవరే దిక్కు

**మహదేవపూర్ సామాజిక వైద్యశాలలో పరిస్థితి**


పేషెంట్ బీపీ చెక్ చేస్తున్న అంబులెన్స్ డ్రైవర్

మహదేవపూర్, జూన్ 16 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నది. ఇటీవల మండలంలోని ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన ఓ యువకుడు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేసిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు అంబులెన్స్ డ్రైవరే దిక్కయ్యాడు. ఆయనే స్వయంగా బీపీ చెక్ చేయడం గమనార్హం. దవాఖానలో ఎవరు ఏం చేస్తున్నారో అర్థం కావడంలేదని అక్కడికి వచ్చిన రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక ఆసుపత్రిలో వసతులు, సరిపడా వైద్యులు లేకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ పాలనలో మెరుగైన వైద్యసేవలందించిన ఆస్పత్రిలో ఇలాంటి పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా వైద్యులు, సిబ్బంది కొరత ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలపై ఉన్నాతాధికారులకు నివేదించామని, త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు.

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


జిమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగురూరల్, జూన్ 16 : వ్యాయామం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి తోపుకుంట కట్ట వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో రెండు ఓపెన్ జిమ్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పని లేదని, రెండో విడుతలో ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొని 15 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

## రైతు భరోసా నిధుల విడుదల

ములుగు, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : వానకాలం రైతు భరోసా నిధులను విడుదల చేస్తూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రెండెకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున నేటి నుంచి జమ కానున్నాయి. ములుగు జిల్లాలో 49,356 మంది రైతులకు రూ.30,10,81,774 జమ చేయనున్నారు.

## రైతులతో సీఎం ముఖాముఖి

గణపురం/ కాటారం/ ఏటూరునాగారం/ మల్లంపల్లి, జూన్ 16: పంటల సాగు విధానంపై అవగాహన కల్పించేందుకు రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని గణపురం, కాటారం, ఏటూరునాగారం, మల్లంపల్లి మండలాల్లోని రైతు వేదికల్లో సైంటిస్టులు, అధికారులతో రైతులు నేరుగా సంభాషించారు. ఆదర్శ రైతుల అనుభవాలు, కొత్త పంటల సాంకేతికతపై చర్చించారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

రేగొండ, జూన్ 16 : అర్హులైన వారందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం ఆయన గోరికొత్తపల్లి మండలకేంద్రంతో పాటు వెంకటేశ్వర్లపల్లె, కోనారావుపేట, సుల్తాన్‌పూర్, నిజాంపల్లె, గాంధీనగర్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం భట్టి

భూపాలపల్లి రూరల్, జూన్ 16: మంజూర్‌నగర్‌లో మంగళవారం జరిగే ప్రజాసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మంజూర్‌నగర్, చెన్నాపూర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదట డిప్యూటీ సీఎం రేగొండ మండలం చెన్నాపూర్‌లో సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారని, అక్కడి నుంచి మంజూర్‌నగర్, నవాబుపేట, ధర్మారావుపేట, గణపురంలో నిర్మించే సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం మంజూర్‌నగర్‌లో జరిగే ప్రజాసభలో పాల్గొంటారని పేర్కొన్నారు. భోజన విరామం తర్వాత కేటీపీపీ గెస్ట్ హౌస్‌లో సింగరేణి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

గోవిందరావుపేట, జూన్ 16 : గత నెలలో కురిసిన వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ రాజుకు వినతిపత్రం అందజేశారు. గుండు రామస్వామి, తీగల ఆదిరెడ్డి, సోమ మల్లారెడ్డి, మురళి, లెనిన్, సమ్మయ్య, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సప్లిమెంటరీలో 88.64 శాతం ఉత్తీర్ణత

భూపాలపల్లి రూరల్, జూన్ 16 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 88.64 శాతం ఉత్తీర్ణత సాధించారని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 396 మంది హాజరు కాగా, 351 మంది ఉత్తీర్ణత సాధించారని, ఒకేషనల్‌లో 35 మందికి 23 మంది, ప్రథమ సంవత్సరం జనరల్‌లో 846 మందికి 708 మంది, ఒకేషనల్‌లో 82 మందికి 70 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూన్ 23 వరకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## పచ్చని చెట్లను నరకడం సరికాదు

గణపురం, జూన్ 16 : సింగరేణి స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం వందలాది చెట్లను తొలగించడం అన్యాయమని టీబీజీకేఎస్ నాయకుడు నరేశ్‌నేత సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 8 ఇన్‌క్లైన్ గని మార్గంలో ఉన్న సింగరేణి స్థలంలో వందలాది చెట్లను ప్రభుత్వం సబ్ స్టేషన్ నిర్మాణం పేరుతో తొలగిస్తోందని పేర్కొన్నారు. పనుల కోసం సింగరేణి అధికారులు సివిల్, ఎస్టేట్, ఫారెస్ట్ అధికారులను కేటాయించారని ఆరోపించారు. అంతేకాకుండా చెట్ల తొలగింపునకు కంపెనీ యంత్రాలనే వినియోగిస్తున్నారని, సబ్ స్టేషన్ నిర్మాణం కోసం సింగరేణి నిధులు, స్థలాలను దుర్వినియోగం చేయడాన్ని టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.

## సోలార్‌పై టీజీబీ అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఏటూరునాగారం, జూన్ 16 : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సోమవారం టీజీబీ ఆధ్వర్యంలో సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం సూర్య ఘర్ స్కీం గురించి ములుగు హబ్ ఫీల్డ్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ వివరించారు. సోలార్‌ను వినియోగదారులకు సబ్సిడీపై అందిస్తామని వివరించారు. అర్హులైన వారు బ్రాంచ్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గారావు పాల్గొన్నారు.

## కాటారం మండలంలో భారీ వర్షం

కాటారం, జూన్ 16 : మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ముఖం చాటిన వరుణుడు ఒక్కసారిగా కరుణించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతున్నది. వేలాది ఎకరాల్లో పత్తి గింజలు నాటిన రైతులు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతుండగా కురిసిన వర్షం ప్రాణం పోసినట్లయింది.

## ఏటూరునాగారంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

ఏటూరునాగారం, జూన్ 16 : మండల కేంద్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో వాగులు, గోదావరి వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. 21 మంది సిబ్బంది స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు ఇక్కడే బస చేయనున్నారు.